గ్రామసభలు విధిగా నిర్వహించాలి: కలెక్టర్

కలెక్టరేట్, జనవరి 20 : నేటి నుంచి నిర్దేశించిన గడువులో అన్ని గ్రామాల్లో విధిగా గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వ్యవసాయాధికారులతో సోమవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామ సభల నిర్వహణ సందర్భంగా హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. బృందాల వారీగా గ్రామాలకు అధికారులను నియమించామని, వారంతా ప్రభుత్వం నిర్ణయించిన విధివిధానాలు పాటించాలని సూచించారు. ఏపథకం కోసం ప్రజలు దరఖాస్తు ఇచ్చినా తీసుకోవాలని స్పష్టం చేశారు. వచ్చిన దరఖాస్తుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో అడిషనల్ కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, డీఆర్‌డీవో శ్రీధర్, డీపీవో రవీందర్, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి: కలెక్టర్ పమేలా సత్పతి

రామడుగు, జనవరి 20 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక సర్వే పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మండలంలోని వెదిర గ్రామ పంచాయతీ కార్యాలయం, గోపాల్‌రావుపేట రైతు వేదికలో క్షేత్ర స్థాయి సర్వేను కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పకడ్బందీగా సర్వే వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ్, చొప్పదండి ఏడీఏ ప్రియదర్శిని, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, ఏవో త్రివేదిక తదితరులు పాల్గొన్నారు.

పద్మనగర్ సమీకృత మార్కెట్‌కు ముగిసిన లక్కీ డ్రా

కార్పొరేషన్, జనవరి 20: కరీంనగర్ నగరపాలక సంస్థ కళాభారతి ఆడిటోరియంలో పద్మనగర్ సమీకృత మార్కెట్ స్టాల్స్‌కు లక్కీడ్రా నిర్వహించారు. కార్యక్రమానికి నగరపాలక సంస్థ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డ్రా తీసి స్టాల్స్ నంబర్లను కేటాయించారు. లక్కీడ్రాలో 114 కూరగాయల స్టాల్స్, 12 పండ్లు, 12 పూలు, 26 మాంసం స్టాల్స్‌తో పాటు 22 షెట్టర్స్‌ను వ్యాపారులకు కేటాయించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, పద్మనగర్ సమీకృత మార్కెట్‌ను ఈనెల 23న ప్రారంభించి, వ్యాపారులకు స్టాల్స్ అప్పగిస్తామని తెలిపారు. స్టాల్స్ పొందిన వ్యాపారులు 3 నెలల అడ్వాన్స్ ముందుగానే చెల్లించి 5 సంవత్సరాలకు అగ్రిమెంట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, ఆర్వో సునీల్, ఆర్ఐ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ప్రీమియర్ బ్యాంకర్ శిక్షణ

శిక్షణకు హాజరైన నిర్వాహకులు, విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, జనవరి 20 : జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఇన్ఫోసిస్, ఐసీటీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 15 రోజుల, 100 గంటల ప్రీమియర్ బ్యాంకర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ఐసీటీ అకాడమీ నిర్వాహకుడు గోపాల్ హాజరై మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమం విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధికి గొప్ప వేదిక అని, దీనిని వినియోగించుకొని భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ దినేశ్, ట్రైనర్ చంద్ర వదన, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ క్రికెట్ పోటీలకు పారమిత విద్యార్థిని

కొత్తపల్లి, జనవరి 20 : ఖమ్మంలో ఈనెల 21 నుంచి 24 వరకు జరుగనున్న ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని సీహెచ్ సాహితి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ తెలిపారు. ఇటీవల జగిత్యాలలో జరిగిన అండర్-17 జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొన్న సాహితి అద్భుత ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థినిని పాఠశాల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు, డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.ఎం.ప్రసాద్, టి.ఎస్.వి.రమణ, కె.హన్మంతరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పథకాల్లో అర్హులకు అన్యాయం జరిగితే నిలదీస్తాం

తెలంగాణచౌక్, జనవరి 20: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పథకాల అమలులో అర్హులకు అన్యాయం జరిగితే పార్టీ తరపున నిలదీస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్ర భవనంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 28 వరకు జరిగే సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇక్కడ నాయకులు నరేశ్ పటేల్, రమేశ్, శ్రీకాంత్, భీమాసాహెబ్ ఉన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

మానకొండూర్, జనవరి 20: ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ పిలుపునిచ్చారు. సోమవారం సదాశివపల్లి స్టేజీ వద్ద మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సంఘటితమై సమరశీల పోరాటాలకు రూపకల్పన చేయబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శాతరాజు భద్రయ్య, మండల కమిటీ సభ్యుడు చౌదరి సంపత్, నాయకులు పలవేణి శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఎమ్మార్పీఎస్ నాయకుల ఫిర్యాదు

హుజూరాబాద్ టౌన్, జనవరి 20: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాల మహానాడు నాయకులు పసుల రామ్మూర్తి, జూపాక సుధాకర్‌పై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ తిరుమల్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఇక్కడ ఎంఎస్పీ జాతీయ నాయకుడు రుద్రారపు రామచంద్రం, రాష్ట్ర నాయకులు మారేపల్లి శ్రీనివాస్, మొలుగూరి ప్రభాకర్, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకుడు కలవల మల్లయ్య, న్యాయవాది కలకోటి శ్రావణ్, సంజీవ్, శ్రీనివాస్ ఉన్నారు.

3ఆర్-డీ8 కాలువకు మరమ్మతులు చేపట్టండి

పూడిక పేరుకుపోయిన కాలువలో దిగి అధికారులను వేడుకుంటున్న రైతులు

గన్నేరువరం, జనవరి 20 : మైలారం గ్రామానికి వెళ్లే సాగునీటి కాలువ 3ఆర్-డీ8కు మరమ్మతులు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆ గ్రామ శివారులోని కాలువలోకి కొందరు రైతులు దిగి నిరసన తెలుపుతూ అధికారులను వేడుకున్నారు. కాలువలో పూడిక పేరుకుపోయిందని, చెట్లు మొలచి నీళ్లు సరిగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పూడిక తీయకపోతే నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు.

నగర రూపురేఖలు మార్చాం

- ఎప్పుడూ లేనంతగా అభివృద్ధి చేశాం
- మేయర్ సునీల్‌రావు

పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో పనులను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, జనవరి 20: కరీంనగర్‌కు తమ పాలకవర్గ హయాంలో పెద్ద ఎత్తున నిధులు వచ్చాయని, వాటితో అనేక అభివృద్ధి పనులు చేపట్టి నగర రూపురేఖలను మార్చామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. సోమవారం 35వ డివిజన్‌లో రూ.35 లక్షల నిధులతో చేపడుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.40 లక్షలతో చేపట్టిన మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. 53వ డివిజన్‌లో రూ.5 లక్షల నిధులతో చేపడుతున్న డ్రైనేజీ పైపులైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఈ ఐదేళ్ల కాలంలో అప్పటి సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో పెద్ద ఎత్తున నిధులు విడుదలయ్యాయని తెలిపారు. ఐదేళ్ల పదవీ కాలంలో నగర ప్రజలకు మెరుగైన సేవలందించామనే సంతృప్తి తమ పాలకవర్గానికి కలిగిందన్నారు. నగర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. స్మార్ట్‌సిటీ నిధులతో పాటు వివిధ గ్రాంట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, మార్కెట్లు, మహిళా, కుల సంఘ భవనాలు, యూత్ క్లబ్ భవనాలు ఇలా చాలా రకాల అభివృద్ధి పనులను చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించామని వివరించారు. సప్తగిరి కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో చాలా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కాలనీల్లో చక్కటి రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేయడంతో పాటు కావాల్సిన మౌలిక సదుపాయాలు అన్ని కల్పించామని తెలిపారు. సుమారు రూ.40 లక్షలతో మహిళా భవనాన్ని నిర్మించామని, ఈ భవనాన్ని కాపాడుకునే బాధ్యత మహిళలదేనని పేర్కొన్నారు. త్వరలోనే నగరంలో అభివృద్ధి చేసిన పార్కులను కూడా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, తుల శ్రీదేవీ చంద్రమౌళి, ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో పనుల పరిశీలన

కార్పొరేటర్, జనవరి 20: నగరంలోని పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో చేపడుతున్న తుది అభివృద్ధి పనులను మేయర్ యాదగిరి సునీల్ రావు పరిశీలించారు. ప్రస్తుతం మార్కెట్‌లో పేయింటింగ్, నంబర్స్ వేసే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వాటిని పూర్తి చేయించి ఈ నెలలోనే మార్కెట్‌ను ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, అధికారులు, ఏజెన్సీ కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సంక్రాంతి ఆదాయం రూ.24.71 కోట్లు

- కరీంనగర్ రీజియన్ పరిధిలో 1430 బస్సులు
- 48.99లక్షల మంది ప్రయాణికుల చేరవేత

తెలంగాణచౌక్, జనవరి 20: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌కు భారీగా ఆదాయం సమకూరింది. ఈ నెల 7 నుంచి 13 వరకు 770 బస్సులను జేబీఎస్ నుంచి హైదరాబాద్‌కు నడిపించారు. తిరుగు ప్రయాణంలో ఈనెల 16 నుంచి 19 వరకు 630 బస్సులను కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు నడిపించారు. ప్రతి రోజు కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు నడిచే 328 బస్సులు కాకుండా 680 బస్సులు అదనంగా నడిపించగా, ప్రత్యేక బస్సులకు అదనంగా 50 శాతం చార్జీలు వసూలు చేశారు. రీజియన్‌లో నడిపించిన మొత్తం 1430 బస్సులకు గానూ రూ.24.71 కోట్ల ఆదాయం వచ్చింది. 43.21లక్షల కిలోమీటర్ల మేర బస్సులు తిరిగాయి. 48లక్షల 99వేల మంది ప్రయాణికులు బస్సులో ప్రయాణించారు. పండుగ రోజుల్లో 88 శాతం ఆక్యుపెన్సీరేషియా నమోదైంది. ఒకటి రెండు రోజులు వందశాతం ఓఆర్‌తో బస్సులు నడిచాయి. రీజియన్ పరిధిలో 11 డిపోలు ఉండగా, గోదావరిఖని డిపో-రూ.3.69 కోట్లు, హుస్నాబాద్-రూ.1.37 కోట్లు, హుజూరాబాద్-రూ.1.75 కోట్లు, కరీంనగర్-ఒకటో డిపో రూ.2.70 కోట్లు, కరీంనగర్-రెండో డిపో రూ.3.16కోట్లు, మంథని-రూ.1.49కోట్లు, జగిత్యాల-రూ.3.18 కోట్లు, మెట్‌పల్లి-రూ.1.79కోట్లు, సిరిసిల్ల-రూ.1.84 కోట్లు, వేములవాడ-రూ.1.83కోట్లు, కోరుట్ల డిపో రూ.1.90 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి. కాగా, కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీని డిప్యూటీ ఆర్ఎం భూపతి రెడ్డి, డీఎంలు విజయమాధురి, మల్లయ్య, ఏటీఎం సురేశ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బస్సులను నడిపించారు.

సమష్టి కృషితో భారీగా ఆదాయం

పండుగకు ముందు నుంచే ప్రణాళికలను రూపొందించాం. రద్దీని బట్టి బస్సులను నడిపించాం. అధికారులు. సిబ్బంది సమష్టి కృషితో ప్రయాణికులకు సేవలందించాం. భారీగా ఆదాయాన్ని గడించడం సంతోషంగా ఉంది.

-బీ రాజు, ఆర్ఎం, కరీంనగర్

టీఎన్జీవోల జిల్లా డైరీని ఆవిష్కరించిన కలెక్టర్

టీఎన్జీవో నూతన సంవత్సర డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పాల్గొన్న నాయకులు, అధికారులు

కొత్తపల్లి, జనవరి 20 : టీఎన్జీవోల కరీంనగర్ జిల్లా నూతన సంవత్సరం-2025 డైరీని సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో ఫంక్షన్‌హాల్‌లో కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగుల స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, జిల్లాలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ఎండోమెంట్ అధికారి సుప్రియ, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ గౌడ్, వెంకటేశ్వర్లు, కట్కూరి నాగుల నరసింహస్వామి, శ్రీకాంత్, రాగి శ్రీనివాస్, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పట్టణ నాయకులు మారుపాక రాజేశ్ భరద్వాజ్, సుమంత్‌రావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వీణవంక, జనవరి 20: దేశాయిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఐలాబాద్ శ్మశానవాటిక నుంచి ప్రధాన రహదారి వరకు రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఇక్కడ మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచులు మర్రి వరలక్ష్మి- స్వామి, బండారి ముత్తయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

జీవీఆర్ పరామర్శ

మానకొండూర్ రూరల్, జనవరి 20: వేగురుపల్లి గ్రామానికి చెందిన చింతలతాడెం స్వప్న ఇటీవల మృతి చెందగా, సోమవారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, నాయకులు కునుకుంట్ల అభిలాష్, పున్నం మల్లయ్య, ఆసరి రమేశ్, శాతరాజు యాదగిరి, నెల్లి శంకర్ తదితరులు ఉన్నారు.

ఆటోయూనియన్ నూతన కార్యవర్గం

హుజూరాబాద్ టౌన్, జనవరి 20: హుజూరాబాద్ డివిజన్ పాపారావు బొంద ఆటోయూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఇసంపల్లి రాజేందర్, ఉపాధ్యక్షుడిగా కొంగ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా బాణాల రాజు, ప్రచార కార్యదర్శిగా లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులుగా చల్లూరి వేణు, లోకిని తిరుపతి, ఎండీ రఫీ, గుండాల మధు, ఎండీ అంకూస్, ఎండీ పాషా, దాట్ల రవి, కే స్వామి, లింగారెడ్డిని పాపారావు బొంద ఆటో డ్రైవర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. తమ ఎన్నికకు సహకరించిన డ్రైవర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, నూతన కార్యవర్గానికి డ్రైవర్లు శుభాకాంక్షలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన వీర్ల

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు

రామడుగు, జనవరి 20 : మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లంక మల్లేశం రూపొందించిన 2025 సంవత్సరం క్యాలెండర్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లంక మల్లేశం మాట్లాడుతూ, గత కొన్నేండ్లుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను వెంకటేశ్వరరావు ఆవిష్కరించడం సంప్రదాయంగా వస్తున్నదన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు చాడ శేఖర్‌రెడ్డి, చాడ ప్రభాకర్‌రెడ్డి, ఎదవెల్లి మల్లేశం, తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాల శాతం పెంచాలి

రామడుగు/చొప్పదండి, జనవరి 20 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల శాతం పెంచాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ప్రభుత్వ వైద్యులకు సూచించారు. చొప్పదండి మండలం గుమ్లాపూర్, రామడుగు మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు గుండి గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణ సందర్శించారు. పీహెచ్‌సీల్లో ఔట్ పేషెంట్, ఐపీతో పాటు లేబర్‌గది, ఫార్మసీ, ల్యాబ్ తదితర గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. ఇక్కడ డీపీవో స్వామితో గుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గ్రీష్మాన్యా, గుమ్లాపూర్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అయూ, సూపర్ వైజర్ శోభ, వైద్యసిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జనవరి 20: ఏబీ స్విచ్‌ల ఏర్పాటుతో పాటు ఇతర పనులు చేపడుతున్నందున మంగళవారం నగరంతో పాటు కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్, కరీంనగర్ రూరల్ ఏడీఈ జీ రఘు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సాయి బాలాజీ నగర్, సీతారాంపూర్, ఎస్సారార్ కాలేజీ ఎదురుగా జగిత్యాల రోడ్డు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు చర్లబుత్కూర్, చామనపల్లి, దుబ్బపల్లి, తాహెర్ కొండాపూర్, బహదూర్ ఖాన్ పేట్, జూబ్లీనగర్, ఫకీర్ పేట్ ప్రాంతాలకు సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దాబాలో అగ్ని ప్రమాదం

రాంనగర్, జనవరి 20: నగర శివారులోని తీగల బ్రిడ్జి సమీపంలో ఓ దాబా హోటల్‌లో సోమవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన దాబా నిర్వాహకులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఫైరింజన్ మంటలను ఆర్పివేయడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. అయితే అప్పటికే హోటల్‌లోని ఫర్నిచర్, ఆహార పదార్థాలు పూర్తిగా కాలిపోయాయి. సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగిందని దాబా నిర్వాహకుడు సోహెల్ తెలిపారు.

మండల వాసికి పూలే అవార్డు

వీణవంక, జనవరి 20: మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోనెల సమ్మన్న ముదిరాజ్ సావిత్రీ బాయి పూలే ఐకాన్ 2025 అవార్డు అందుకున్నారు. గ్రామంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాను చేస్తున్న సేవలను గుర్తించి అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్, సావిత్రీ బాయి పూలే జయంతిని పురస్కరించుకొని సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందజేసినట్లు సమ్మన్న ముదిరాజ్ తెలిపారు.

ఒకరి రిమాండ్

శంకరపట్నం, జనవరి 20: పీర్‌లెస్ చిట్టీ డబ్బుల వివాదంలో ఓ వ్యక్తి గాయపడి కోమాలోకి వెళ్లడానికి కారకుడైన మరో వ్యక్తిని సోమవారం కేశవపట్నం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కొన్నేండ్ల క్రితం మొలంగూర్ గ్రామానికి చెందిన కొలిపాక సమ్మయ్య.. అదే గ్రామానికి చెందిన కల్లూరి శ్రీనివాస్ అనే వ్యక్తి భార్యకు పీర్‌లెస్ స్కీమ్ కింద రూ.6 వేలు చెల్లించాడు. అయితే శ్రీనివాస్ భార్య సమ్మయ్యకు ఆ డబ్బులు చాలా కాలం గడిచినా తిరిగి చెల్లించలేదు. ఈ విషయమై నాలుగు నెలల క్రితం అదే గ్రామ శివారులో సమ్మయ్య, శ్రీనివాస్ మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో బైక్‌పై ఉన్న సమ్మయ్యను శ్రీనివాస్ కిందకు తోసివేసి దాడి చేశాడు. ఈ ఘటనలో సమ్మయ్యకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు. దవాఖానలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయినా ఇప్పటికీ కోమాలోనే ఉన్నాడు. ఈ ఘటనపై సమ్మయ్య భార్య కొలిపాక నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. ఈ కేసులో నిందితుడు శ్రీనివాస్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వీణవంక, జనవరి 20: మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. కరీంనగర్ శ్రీ ఈశ్వర హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు బీఆర్ఎస్ యూత్ నియోజకవర్గ నాయకుడు నాగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇక్కడ మాజీ సర్పంచ్ సంది సమ్మిరెడ్డి, నాయకులు గంధం బాలస్వామి, మణిదీప్, మల్లేశ్, తదితరులు ఉన్నారు.

ఆలయ పునర్ నిర్మాణానికి కృషి

కమాన్‌చౌరస్తా, జనవరి 20 : జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ హరిహర క్షేత్రం పునర్ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు దేవాలయ చైర్మన్ యాగండ్ల అనిల్ కుమార్ గౌడ్, కార్యనిర్వహణాధికారి కే కాంత రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా, అయ్యప్ప మండప పునర్ నిర్మాణం, అయ్యప్ప స్వాములు భిక్ష చేసేందుకు మండపం, మరుగుదొడ్లు తదితర అభివృద్ధి పనులకు సంబంధించి ప్రత్యేక బ్యాంక్ అకౌంట్‌తో దాతల సహకారంతో ముందుకు సాగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే, సోమవారం ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించగా, రూ. 3,95,430 సమకూరినట్లు చెప్పారు. అలాగే, ఆలయంలో అయ్యప్ప దీక్ష సమయంలో నిర్వహించిన అన్నదానం, ఇతర కార్యక్రమాల ద్వారా ఆలయానికి రూ. 25,77,477 ఆదాయం సమకూరగా, రూ. 19,08,013 ఖర్చయినట్లు దేవాలయ చైర్మన్ ధర్మకర్త మండలి సభ్యులు, ఈవో వెల్లడించారు. ఇక్కడ ధర్మకర్తల మండలి సభ్యులు సత్యనారాయణ, ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్, కృష్ణ, కవిత, అర్చకులు రాజేశ్వర శర్మ, చాణక్య శ్రీనివాస్, మూర్తి తదితరులు